- గాగిల్లాపూర్ భూదాన్ భూమిలో అక్రమార్కులకు అండగా అధికారులు..!
- అక్రమ షెడ్డుపై రెవెన్యూ ఉదాసీనత..! మొక్కుబడిగా పాక్షిక చర్యలు..
- రెవెన్యూ పాక్షికంగా కూల్చేసిన షెడ్డుకు..! గుడ్డిగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్..
- కళ్ళులేని కబోదిలా వ్యవహరిస్తున్న టిజీఎస్‌పిడిసిఎల్ యంత్రాంగం..
- కూల్చేసిన అక్రమ షెడ్డుకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎలా సాధ్యం..?
- నిర్మాణం ఉంటేచాలు కరెంటు ఇస్తామని చెబుతున్న విద్యుత్ అధికారులు..
- అవగాహనా రాహిత్యమా..? అధికారుల సమాధానం దేనికి సంకేతం..!
- రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినా..! కాలయాపన..!
- నిబంధనలకు పాతరేసి..! నిధులు సమకూర్చుకోవడంలో నిమగ్నం..?


# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

సోమవారం | 18 ఆగస్టు 2025 | పేజీలు 8




కూల్చేసిన అదే అక్రమ షెడ్డుకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్..

# కూల్చేసిన అక్రమ షెడ్డుకు..! విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

## మొక్కుబడిగా రెవెన్యూ చర్యలు..!విద్యుత్ అధికారుల ట్రాన్స్‌ఫార్మర్..

అధికారులకు చెప్పుకోవడానికో సాకు దొరికితే చాలు..! పొంతన లేని సమాధానం చెప్పడం కొత్తేమి కాదు.. ముఖ్యంగా ఇలాంటి వ్యవహారంలో దుండిగల్ రెవెన్యూ అధికారులకు వెన్నతో పెట్టిన విద్య.. బహుదూర్‌పల్లి సర్వే నెంబర్ 227 ప్రభుత్వ భూమిలో, అక్రమ షెడ్డుకు నోటీసులు ఇచ్చిన తహశీల్దార్ మతీన్, ఏడాది దాటినా చర్యల ఊసేలేదు.. రెండుసార్లు మొక్కుబడిగా పాక్షిక చర్యలతో మమః అనిపించి ముడుపులు పుచ్చుకున్నట్టు ఆరోపణలు ఉండగా..! ఇప్పుడు పై అధికారులను కూడా మేనేజ్ చేసి, చర్యలు లేకుండా సైలెంట్ అయ్యారని సమాచారం..! ఇదే తరహాలో గాగిల్లాపూర్ భూదాన్ భూమిలోని అక్రమ షెడ్డు వ్యవహారంలోనూ తమ నైపుణ్యాన్ని ప్రదర్శించినట్లు సర్వత్రా ఆరోపణలు వస్తున్నాయి.. అందుకు సాక్ష్యమే ఈ పాక్షిక కూల్చివేతల షెడ్డు..! రెవెన్యూ కూల్చేసిన అరకొర చర్యలకు విద్యుత్ శాఖ చేతివాటం తోడై..! అక్రమంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పలు విమర్శలకు దారితీస్తుంది.. మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 17:




గాగిల్లాపూర్ భూదాన్ భూమిలో అక్రమ షెడ్డు(కూల్చివేతకు ముందు)



భూదాన్ భూమిలో అక్రమ షెడ్డును కూల్చేస్తున్న రెవెన్యూ అధికారులు..

## హైదరాబాద్‌లో కృష్ణాష్టమి వేడుకల్లో తీవ్ర విషాదం..
# విద్యుత్ తీగలు తగిలి ఐదుగురు మృతి

హైదరాబాద్ పెన్ పవర్: రామంతాపూర్‌లోని గోకుల్‌నగర్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన శోభాయాత్రలో రథానికి విద్యుత్ తీగలు తగిలి షాక్‌తో ఐదుగురు వ్యక్తులు మృతిచెందారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఊరేగింపు ముగించుకొని వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ఈ ఘటనలో మరో నలుగురు గాయపడ్డారు. గాయపడిన వారిలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గన్‌మెన్ శ్రీనివాస్ ఉన్నట్లు సమాచారం.



# అక్టోబరు 2 నుంచి లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలు

## నేటి నుంచి రెండో విడత శిక్షణ కార్యక్రమం
## రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్రంలో భూ సర్వేకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పటిష్ఠ చర్యలు చేపడుతున్నామని, అక్టోబరు 2(గాంధీ జయంతి) నుంచి లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఆదివారం ఆయన భూ కొలతలు,

-3 లో

# కూల్చేసిన అక్రమ షెడ్డుకు..! విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్..





ఫాక్స్‌సాగర్ నాలాపై అక్రమ నిర్మాణానికి ట్రాన్స్‌ఫార్మర్..



బహుదూర్‌పల్లి 227 ప్రభుత్వ భూమిలో తహశీల్దార్ నోటీసు ఇచ్చిన అక్రమ షెడ్డు ఇదే..

ఓవైపు
తెలంగాణ ఉన్నత న్యాయస్థానం
మొట్టికాయలు వేస్తున్నా..! అధికారుల తీరు
మారడం లేదు.. గాగిల్లాపూర్ భూదాన్ భూమిలో
అక్రమ షెడ్డుని రెవెన్యూ అధికారులు కూల్చిన విషయం
కళ్లెదుటె కనిపించినా..! గుడ్డిగా, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్
ఏర్పాటు..! ఫాక్స్‌సాగర్ నాలాపై, మార్వాడి అక్రమ నిర్మాణానికి
సంబంధించిన తప్పుడు పర్మిషన్‌లను కూడా జీహెచ్‌ఎంసి
రద్దుచేసింది.. ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ ఇవ్వలేదు.. అయినప్పటికీ 10
మీటర్ల ఎత్తు నిబంధన ప్రక్రియతో 'ఓసీ' లేకపోయినా కుత్బుల్లాపూర్
విద్యుత్ అధికారులు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు ఎలా సాధ్యం..?
చారిత్రాత్మక ఫాక్స్‌సాగర్ నాలాపై మార్వాడి షాపింగ్
కాంప్లెక్స్‌కి, గాగిల్లాపూర్‌లో రెవెన్యూ కూల్చేసిన షెడ్డుకు
విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల మంజూరు అధికారుల
ప్రతిపాదనలు లేకుండా సాధ్యమేనా..?



GOVERNMENT OF TELANGANA
(REVENUE DEPARTMENT)

Office of the Tahsil,
Gandimaisamma-Dundigal Mandal.

Dated:07.05.2024.

No.B/528/2024

NOTICE UNDER SECTION 7 OF
A.P. LAND ENCROACHMENT ACT III OF 1905

To
Kum. Gaddam Sahiti Reddy D/o. G.Surender Reddy

Whereas you are reported to be un-authorized occupation of the land specified in the scheduled below, which is the property of Government. You are hereby given notice that if you desire so you may, before 9khy show cause either in person or in writing before me/the Collector why you should not addition to the full assessment on the land under section (3) (1) of the Act to the rate prescribed by or under section 3 (ii) of the act to charged a penalty for such occupation under section 5 of Act III of 1905 or and be subjected to eviction from the land and things deposited there on under section 6 of the said Act.

| Name of Village | Sy. No. and Sub-Division | Description of land | Total extent Ac-gts., | Encroached extent Ac-gts., | Nature of Occupation |
|---|---|---|---|---|---|
| Bahadurpally | 227 | Poramboke | 353-35 | 400 sq. yds (approx) | (01) Shed |

In view of the above the Girdawar of this office are directed to service and to return the served copy.

9951994277

Tahsildar,
Gandimaisamma-Dundigal Mandal.

227 ప్రభుత్వ భూమిలో షెడ్డుకు తహశీల్దార్ నోటీసు ఇదే..

## కూల్చేసిన అక్రమ షెడ్డుకు.. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్..

మేడ్చల్ జిల్లా దుండిగల్ గండిమైసమ్మ మండలం గాగిల్లాపూర్ గ్రామ శివారు, భూదాన్ భూమిలో రెవెన్యూ అధికారులు కూల్చేసిన,అదే అక్రమ షెడ్డుకు, దొమ్మర పోచంపల్లి విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు తీవ్ర విమర్శలకు తావిస్తోంది.. భూదాన్ భూమిలో భారీ షెడ్డును, రెవెన్యూ అధికారులు కూల్చేసినట్లు అక్రమ షెడ్డు, కళ్లెదుటే సాక్షాత్కరిస్తుంటే..! విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎలా ఇచ్చారని సంబంధిత ఏరియా, ఏఈతో (ఇంచార్జ్ ఏఈ) విషయాన్ని పెన్ పవర్ ప్రతినిధి ప్రస్తావించగా..! రెవెన్యూ అధికారులు, సంబంధిత షెడ్డును పూర్తిగా కూల్చేస్తే, తాము విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తొలగిస్తామని, ఇంచార్జ్ విద్యుత్ అధికారి(ఏఈ షాపూర్) సమాధానం పలు అనుమానాలకు తావిస్తోంది..

- మొదటి పేజి తరువాయి

రోజురోజుకు అధికారుల విధుల్లో పారదర్శకత మచ్చుకు కూడా కనిపించటం లేదు.. మరోవైపు శాఖల సమన్వయ లేమితో ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ ఉదాసీనతతో వ్యవహరిస్తుండగా..! విద్యుత్ శాఖ తానా తందాన అంటూ, అవగాహనా రాహిత్యంతో అక్రమ విద్యుత్ కనెక్షన్‌లు, వక్రమార్గంలో ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటు పలు విమర్శలకు తావిస్తోంది.. ఈ వ్యవహారంలో రూ. కోట్లు విలువచేసే ప్రభుత్వ భూములు, భూదాన్ భూములు వక్రమార్గంలో క్రమబద్ధీకరణ అవుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి.. గతంలోనే అక్రమ నిర్మాణాలు అరికట్టడంలో జీహెచ్‌ఎంసి, మున్సిపల్ యంత్రాంగం విఫలం అవుతుందని, వెంటనే సరిచేసుకోవాలని, తెలంగాణ హైకోర్టు పలుమార్లు వ్యాఖ్యలు చేసినా..! అధికారుల్లో మార్పు కనిపించడం లేదు..! తాజాగా "ఆక్యుపెన్సీ సర్టిఫికేట్" లేకుండా విద్యుత్ కనెక్షన్ ఇవ్వకూడదని తెలంగాణ హైకోర్టు "టిజిఎస్‌పిడిసిఎల్"కి సూచించింది.. నిబంధనల ప్రకారం నిర్మాణాలు పూర్తిచేసుకుని, చట్టబద్ధంగా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఉంటేనే కొత్త విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్పీడీసీఎల్‌కు తెలంగాణ ఉన్నత న్యాయస్థనం స్పష్టంచేసింది..

## ప్రభుత్వ ఆస్తుల కబ్జాలపై.. అధికారుల పరాచకాలు..

ప్రభుత్వ భూములు, భూదాన్ భూముల్లో అక్రమ నిర్మాణాల వ్యవహారంలో రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యమే వహిస్తున్నారో..! నిధులు సమకూర్చు కుంటున్నారో తెలియదు కానీ..! కరెప్షన్‌కి పాల్పడుతున్నట్లు మాత్రం స్పష్టమవుతుంది..! మరోవైపు అక్రమ నిర్మాణాలపై చర్యల విషయంలో రెవెన్యూ అధికారులు పక్క పథకం ప్రకారమే అక్రమార్కులకు సహకరిస్తున్నారు.. అక్రమార్కుల ప్రలోభాలకు తలొగ్గి, ప్రభుత్వ భూమిలో నోటీసులు ఇచ్చిన అక్రమ షెడ్లకు సైతం, లక్షల్లో ముడుపులు పుచ్చుకుని, బరితెగించి పాక్షిక చర్యలతో సైలెంట్ అవుతున్నారు.. అందుకు దుండిగల్ మండలం బహుదూర్‌పల్లి 227 ప్రభుత్వ భూమిలో సురేందర్ రెడ్డి అక్రమ షెడ్డు నిర్మాణం..! గాగిల్లాపూర్ భూదాన్ భూమిలో అక్రమ షెడ్డు ప్రత్యేక నిదర్శనంగా చెప్పవచ్చు..

## అక్టోబరు 2 నుంచి లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలు

- మొదటి పేజీ తరువాయి

భూ దస్త్రాల నిర్వహణ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..'భూముల రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ తప్పనిసరి చేస్తూ భూభారతి చట్టం అమల్లోకి తీసుకొచ్చిన నేపథ్యంలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలు ప్రాధాన్యంగా మారాయి. అవసరమైన సర్వేయర్లను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మొదటి దశలో ఈ ఏడాది మే 26 నుంచి జులై 26 వరకు జిల్లా కేంద్రాల్లో ఏడు వేల మందికి శిక్షణ ఇచ్చాం. అనంతరం గత నెలాఖరున జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో ప్రాక్టికల్ పరీక్షలు పూర్తి చేశాం. అర్హులకు 40 రోజులపాటు అప్రెంటిస్ శిక్షణ ఇస్తున్నాం. ఈ శిక్షణ పూర్తయిన వెంటనే లైసెన్సులు జారీ చేసి వారి సేవలను సమర్థంగా వినియోగించుకుంటాం. అందుకు వీలుగా సర్వే మాన్యువల్‌ను రూపొందించాలని అధికారులను ఆదేశించాం. రెండో విడత శిక్షణ సోమవారం నుంచి జిల్లా కేంద్రాల్లో ప్రారంభమవుతుంది. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులు ఉదయం 10 గంటల లోపు సర్వే విభాగం సహాయ సంచాలకులకు రిపోర్ట్ చేయాలి' అని సూచించారు.

## జమ్మూకశ్మీర్‌లో మళ్లీ జల ప్రళయం.. కథువాలో నలుగురు బలి

- ఆకస్మిక వరదలతో ఓ గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు కట్
- రైల్వే ట్రాక్, జాతీయ రహదారి ధ్వంసం
- సహాయక చర్యలు ముమ్మరం చేసిన అధికార యంత్రాంగం
- ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లొద్దని ప్రజలకు హెచ్చరిక

హైదరాబాద్ పెన్ పవర్:జమ్మూకశ్మీర్‌లోని కథువా జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గత రాత్రి కురిసిన భారీ వర్షాలు నలుగురి ప్రాణాలను బలితీసుకున్నాయి. మరికొందరు గాయపడ్డారు. వరద ప్రవాహం కారణంగా ఒక గ్రామానికి బాహ్య ప్రపంచంతో పూర్తిగా సంబంధాలు తెగిపోవడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోంది. ఈ ప్రకృతి విపత్తు కారణంగా జిల్లాలో తీవ్ర నష్టం వాటిల్లింది. రైల్వే ట్రాక్‌తో పాటు జాతీయ రహదారి కూడా దెబ్బతిన్నట్లు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌పైనా వరద ప్రభావం పడిందని ఆయన 'ఎక్స్'లో వెల్లడించారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, పౌర, సైనిక, పారామిలిటరీ బలగాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ దుర్ఘటనపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఆయన, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రభావిత ప్రాంతాల్లో తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని, బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు.

భారీ నుంచి అతి భారీ వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో కరువా జిల్లా యంత్రాంగం ప్రజలకు కీలక హెచ్చరికలు జారీ చేసింది. నదులు, వాగులు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించింది. ఆకస్మిక వరదల ముప్పు పొంచి ఉన్నందున అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అనవసర ప్రయాణాలు మానుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# 917%, 367%... తెలుగు రాష్ట్రాల్లో విపరీతంగా పెరిగిన అబార్షన్లు..!



హైదరాబాద్ పెన్ పవర్:మాతృత్వం ఓ గొప్పవరం. అది దక్కనివారికి ఆ విలువ తెలుస్తుందనేది నిజం! అయితే అవగాహనా లోపమో, అజ్ఞానమో, ఆవేశంలో తీసుకున్న నిర్ణయమో, ఆరోగ్య సమస్యో... కారణం తెలియదు కానీ భారతదేశంలో.. ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాల్లో అబార్షన్ల సంఖ్య భారీ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తుంది. తాజాగా కేంద్రం ఈ లెక్కలు వెల్లడించింది. దీంతో తెలుగు రాష్ట్రాలకు సంబంధించి విస్తుపోయే విషయాలు తెరపైకి వచ్చాయి!

అవును... అబార్షన్ల సంఖ్యకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన వివరాలు షాకింగ్ గా మారాయి. దక్షిణాది రాష్ట్రాల్లో, మరీ ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో అబార్షన్లు భారీగా పెరగడం ఆందోళనకు గురి చేస్తోంది. అందులోనూ తెలంగాణలో మరింత ఎక్కువగా అబార్షన్లు జరుగుతున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ క్రమంలో గత ఐదేళ్లలోని లెక్కల గురించి ఇప్పుడు తెలుసుకుందాం..!

2020-21లో తెలంగాణలో జరిగిన అబార్షన్ల సంఖ్య 1,578గా ఉండగా.. 2022-23లో ఆ సంఖ్య 4,071గా ఉంది. ఇక, 2023-24లో ఆ సంఖ్య 12,365కి చేరగా.. 2024-25కి వచ్చేసరికి 16,059కి పెరిగినట్లు కేంద్రం తెలిపింది. అంటే... 2020-21తో పోలిస్తే ఏకంగా 917 శాతం పెరిగినట్లన్నమాట. దీంతో.. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఈ స్థాయిలో గర్భస్రావాలు నమోదు కాలేదని కేంద్రం తెలిపింది!

ఇక ఏపీ విషయానికొస్తే... 5 ఏళ్లలో 367% గర్భస్రావాలు పెరిగిపోయినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇందులో భాగంగా... 2020-21లో ఏపీలో అబార్షన్ల సంఖ్య 2,282గా ఉండగా.. 2024-25 నాటికి అది 10,676కు పెరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇదే సమయంలో... కేరళలో 2020-2021లో 8,525 గర్భస్రావాలు నమోదు కాగా.. 2024-25కి ఆ సంఖ్య 25,884కు ఎగబాకిన పరిస్థితి!

**12 వారాలు పూర్తి కాకముందే...!:**

తెలంగాణలో భారీగా గర్భస్రావాలు పెరగడానికి గల కారణాలపై రాష్ట్ర మాతా శిశు ఆరోగ్య విభాగం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వి.కె. సుమిత్ర స్పందించారు. ఈ సందర్భంగా... చాలా అబార్షన్లు 12 వారాలు పూర్తి కాకముందే జరిగాయని.. పిండం అభివృద్ధి చెందే సమయంలో జన్యుపరమైన, క్రోమోజోములు, పుట్టుకతో వచ్చే అసాధారణ లక్షణాలు వంటి వైద్య సమస్యల వల్ల గర్భస్రావాలు జరుగుతాయని అన్నారు.

# ఈ రోజు ఒక ప్రత్యేకమైన ఆహ్వానం అందింది... నాకు ఇదొక ప్రత్యేకమైన అనుభూతి: కేటీఆర్

- ఓ బీఆర్ఎస్ కార్యకర్త కూతురి పెళ్లి పిలుపుపై కేటీఆర్ భావోద్వేగం
- తండ్రి, అన్నయ్య లేని లోటు తీర్చాలంటూ యువతి అభ్యర్థన
- గంభీరావుపేట మండలానికి చెందిన నవిత పంపిన ప్రత్యేక ఆహ్వానం
- ఆడబిడ్డకు అండగా నిలవడం తన బాధ్యత అని స్పష్టం చేసిన కేటీఆర్
- పార్టీ ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ



హైదరాబాద్ పెన్ పవర్:బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక ప్రత్యేకమైన వివాహ ఆహ్వానంపై భావోద్వేగానికి గురయ్యారు. తండ్రి, అన్నయ్యను కోల్పోయిన ఓ యువతి, తన పెళ్లికి అండగా నిలవాలని కోరుతూ పంపిన పిలుపు తన మనసును కదిలించిందని ఆయన తెలిపారు. ఆ ఆడబిడ్డకు అన్నగా అండగా నిలవడం తన బాధ్యత అని ప్రకటించారు.వివరాల్లోకి వెళితే, గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన ధ్యానబోయిన నర్సింలు బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా పనిచేస్తూ కరోనా మహమ్మారి సమయంలో మరణించారు. ఆ తర్వాత, ఆయన కుమారుడు ధ్యానబోయిన నరేష్ కూడా ఓ రోడ్డు ప్రమాదంలో కన్నుమూశారు. మరణానంతరం కూడా తన అవయవాలను జీవన్‌దాన్‌కు దానం చేసి నరేష్ ఆదర్శంగా నిలిచారు.

ఇలా తండ్రి, అన్నయ్య ఇద్దరినీ కోల్పోయిన నర్సింలు కుమార్తె నవితకు వివాహం నిశ్చయమైంది. ఈ సందర్భంగా ఆమె కేటీఆర్‌కు పెళ్లి పత్రిక పంపుతూ ఒక ప్రత్యేకమైన అభ్యర్థన చేశారు. "నా వివాహానికి నాన్న, అన్నయ్య లేని లోటును మీరే తీర్చాలి" అని ఆమె కోరారు. ఈ ఆహ్వానం తనను తీవ్రంగా కదిలించిందని కేటీఆర్ పేర్కొన్నారు."ఇది కేవలం ఆహ్వానం కాదు, నా మీద ఉంచిన నమ్మకం. ఒక అన్నయ్యపై పెట్టుకున్న ఆశ.


ఆ ఆడబిడ్డ కోరికను గౌరవించడం నా కర్తవ్యంగా భావిస్తున్నాను" అని కేటీఆర్ అన్నారు. ప్రజలతో తమకున్న అనుబంధం రాజకీయాలకు అతీతమైనదని, ఇలాంటి సంఘటనలు తామంతా ఒకే కుటుంబం అనే విషయాన్ని గుర్తుచేస్తాయని ఆయన వివరించారు.నవిత, సంజయ్ దంపతుల కొత్త జీవితం సంతోషంగా సాగాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. ఆ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని కేటీఆర్ హామీ ఇచ్చారు.

# మార్వాడీ గో బ్యాక్ ఉద్యమం నిజంగానే రాజకీయ కుట్రేనా?

మార్వాడీ గో బ్యాక్ ఉద్యమం తెలంగాణ వ్యాప్తంగా ఊపందుకుంటోంది. అయితే దీనిని రాజకీయ ఉద్యమంగా కొందరు కొట్టిపారేస్తున్నారు. బీజేపీకి అండగా నిలిచే మార్వాడీలను అణిచివేసేందుకు ఈ ఉద్యమం పుట్టిందని బీజేపీ ఆరోపిస్తుండగా, మరొకవైపు కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు కూడా మార్వాడీ గో బ్యాక్ ఉద్యమానానికి అండగా నిలుస్తుండటంతో దీనికి రాజకీయ రంగు పులుముకుంది. ఈ ఉద్యమం పురుడు పోసుకోవడానికి ప్రధాన కారణం ఒక మార్వాడీ తన కారును తీయమని అడిగిన తెలంగాణ యువకుడిని చితకబాదడంతోనే తలెత్తిందని చెబుతున్నారు. ఎక్కడి నుంచో ఇక్కడకు బతకడానికి వచ్చిన వారు దాడులకు దిగుతున్నారంటూ తొలుత సోషల్ మీడియాలో మొదలయిన ఉద్యమం తర్వాత వీధుల్లోకి చేరింది.

**స్థానికులకు ఉపాధి అవకాశాలు...**

మార్వాడీలు ఇక్కడకు వచ్చి వ్యాపారాలు చేయడమే కాకుండా ఇక్కడి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని ప్రధానంగా కొందరు ఆరోపిస్తున్నారు. అయితే ఈ నెల 18వ తేదీన ఆమనగల్లు బంద్ కు తొలుత పిలుపునిచ్చినప్పటికీ దానిని వాయిదా వేసుకున్నారు. మార్వాడీ సంఘాల నేతలతో చర్చలున్నందున బంద్ ను వాయిదా వేయనున్నట్లు ప్రకటించారు. అయితే మార్వాడీలు వ్యాపారాలు చేసుకుంటూ బతకవచ్చని, అదే సమయంలో ఉపాధి అవకాశాలు స్థానికులకు


తేది 18-08-2025 సోమవారం రోజున
మార్వాడీ వ్యాపారస్తులు గోబ్యాక్
అను అంశంపై ఆమనగల్లు
సమస్త వ్యాపారస్తులందరూ స్వచ్ఛందంగా

ఆమనగల్లు బంద్

ఇట్లు
కిరాణ సంఘం - వస్త్ర సంఘం
వర్తక సంఘం - స్వర్ణకార సంఘం
ఆమనగల్లు



కల్పించాలని, వారు కనీసం జీఎస్టీ, రాష్ట్ర పన్నులు కూడ చెల్లించడం లేదని, ఆన్ లైన్ నగదు లావాదేవీలను వారు అనుమతించడం లేదని, దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ వినిపిస్తుంది.

**తమ నుంచి దూరం చేయడానికేనంటూ...**

మరొకవైపు బీజేపీ నేతలు దీనిని ఖండిస్తున్నారు. మార్వాడీలను బీజేపీకి దూరం చేయడానికే ఈ రకమైన ఉద్యమాన్ని తెరమీదకు కాంగ్రెస్, బీఆర్ఎస్ తీసుకువచ్చాయని ఆయన ఆరోపించారు. మార్వాడీలు రాష్ట్రానికి ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. పెట్టుబడులు తెచ్చే వారిని తరిమేస్తారా? అని ప్రశ్నిస్తున్నారు. మరొకవైపు మార్వాడీల వైఖరిని వ్యతిరేకిస్తూ గోరటి రమేష్ పాటపాడటంతో అతని అరెస్ట్ మరింత ఉద్రిక్తతకు దారితీసింది. హైదరాబాద్ నగరంతో పాటు తెలంగాణలోని ప్రధాన నగరాల్లో మార్వాడీలు వ్యాపారాలు చేసుకుంటున్నారని, వారికి రాజకీయం అంటగడితే ఎలా అని కమలనాథులు ప్రశ్నిస్తున్నారు. భారత్ లో ఎక్కడైనా జీవించే హక్కు అందరికీ ఉంటుందని వాదిస్తున్నారు.

**వారు అలా అంటే...**

మార్వాడీ గో బ్యాక్ ఉద్యమాన్ని కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు వెనకుండి నడిపిస్తున్నారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. తాము కూడా రోహింగ్యాలు గో బ్యాక్ నినాదాన్ని అందుకుంటామని, వారిని కూడా తెలంగాణ నుంచి ప్రభుత్వం పంపించి వేయాలని డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ అగ్ర నేతలు ఎవరూ మార్వాడీ గో బ్యాక్ ఉద్యమంపై స్పందించడం లేదు. అలాగే బీఆర్ఎస్ అగ్ర నేతలు కూడా ఈ ఉద్యమానికి దూరంగా ఉన్నారు. కేవలం ఆ రెండు పార్టీల క్యాడర్ పాల్గొంటే అది స్థానిక అంశాలకు సంబంధించిందని ఆ పార్టీలు వాదిస్తున్నాయి. మొత్తం మీద తెలంగాణలో మరొక ఉద్యమం ఎన్నికలకు ఇన్నేళ్లకు ముందు రూపుదిద్దుకోవడం రాజకీయంగా ఎవరికి లాభమో తెలియదు కానీ.. క్షేమకరం కాదని పలువురు తెలంగాణ సామాజికవేత్తలు అంటున్నారు.

# భారత్ పై సుంకాల విషయంలో ట్రంప్ హింట్.. ఏమిటీ గంతులు? ఇలా రష్యా నుంచి చమురు ది

**హైదరాబాద్ పెన్ పవర్:** అలాస్కా వేదికగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య ఉక్రెయిన్ యుద్ధం ముగించే విషయంపై చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ భేటీ వల్ల ప్రయోజనం ఏమీ కలగనప్పటికీ.. ఈ భేటీకి ముందు, తర్వాత భారత్ పై అదనపు సుంకాల విషయంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు మాత్రం చర్చనీయాంశంగా మారాయి. రష్యాతో భేటీ వేళ చేయడంతో ఈ వ్యాఖ్యలపై సందేహాలూ వినిపిస్తున్నాయి!

అవును... రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై అదనంగా సెకండరీ టారిఫ్ లను విధిస్తున్నట్లు ప్రధానంగా భారత్ ను దృష్టిలో పెట్టుకుని ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే! అయితే తాజాగా... తాము ఆ సెకండరీ టారిఫ్ లను విధించకపోవచ్చని ట్రంప్ సంకేతాలిచ్చారు. పుతిన్ తో కీలక భేటీ ముగిసిన అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.



ఇందులో భాగంగా... ఈ రోజు జరిగిన పరిణామాల తర్వాత.. రష్యా చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై అదనపు సుంకాల గురించి రెండు, మూడు వారాల్లో పునరాలోచన చేస్తాం అని ట్రంప్ వెల్లడించారు. పుతిన్ తో భేటీకి ముందు కూడా ట్రంప్ దీనిపై స్పందిస్తూ... రష్యా తన చమురు క్లయింట్ ను కోల్పోయిందని (భారత్ ను ఉద్దేశించి) వ్యాఖ్యానించారు. అయితే.. గత కొనుగోళ్లు సుమారు 40 శాతం ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే... ప్రస్తుతానికి భారత్, చైనా లాంటి దేశాలపై అదనపు టారిఫ్ లు విధించే ఉద్దేశం లేదని అన్నారు. కాగా... భారత్ పై ఇటీవల 25% అదనపు సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ కొత్త టారిఫ్ లు ఆగస్టు 27 నుంచి అమల్లోకి రానున్నాయి.

దీంతో... అగ్రరాజ్యాధిపతి అయిన ట్రంప్ ఇలా తన అవసరాలకు తగ్గట్లుగా, పరిస్థితులను మేనేజ్ చేసేందుకు ఏమార్చే విధంగా... ఇలా పూటకో మాట, రోజుకో నిర్ణయం తీసుకోవడం సరైంది కాదని.. ఆయన వ్యాఖ్యలు, నిర్ణయాలు హుందాగా, శిలాసాసనంలా ఉండాలని.. అలా కాకుండా ఇలా కప్ప గంతుల్లా ఉండటం ఏమిటని పలువురు ప్రశ్నిస్తుండటం గమనార్హం.

**వెనక్కి తగ్గని భారత్!:**

ఇలా రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటుందన్న కారణంతో భారత్ పై డొనాల్డ్ ట్రంప్ ఇటీవల సుంకాలను పెంచిన సంగతి తెలిసిందే. అయితే.. ఈ పరిణామంతో భారత్ వెనక్కు తగ్గి.. మాస్కో నుంచి చమురు కొనుగోళ్లను నిలిపేయడం లాంటిదేమీ చేయలేదని 'ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్' ఛైర్మన్ ఏఎస్ సాహ్నీ తెలిపారు. అమెరికా సుంకాలకు ప్రతిస్పందనగా.. కొనుగోళ్లను తగ్గించాలని, లేదా పెంచాలని తమకు ఎటువంటి సూచనలూ అందలేదని అన్నారు.

## అరచేతిలో సూర్యుడిని ఆపలేరు: జూ.ఎన్టీఆర్‌కు మాజీ మంత్రి రోజా మద్దతు



హైదరాబాద్: జూనియర్ ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన్న వార్-2 సినిమాపై అనంతపురం టీడీపీ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. వార్ 2 సినిమాకు ఎవరూ వెళ్లొద్దంటూ ఎన్టీఆర్?ను రాయలేని బాషలో బూతులు తిట్టాడు ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్. ఈ క్రమంలో జూనియర్ ఎన్టీఆర్?పై ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ చేసిన కామెంట్లపై వైసీపీ నేత, మాజీ మంత్రి రోజా స్పందించారు. ఈ మేరకు శంషాబాద్ ఎయిర్ పోర్టులో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయాలను, సినిమాలను కలపొద్దని.. పాలిటిక్స్?లో ఉన్న వారు సినిమాల గురించి.. సినీ రంగంలో ఉన్న వారు రాజకీయాల గురించి మాట్లాడొద్దని హితవు పలికారు. టీడీపీ ఎమ్మెల్యే ఎన్టీఆర్ సినిమాను ఎవరూ చూడొద్దని చెప్పడం కరెక్ట్ కాదన్నారు. ఎన్టీఆర్ రాజకీయాల్లో లేరని.. ఆయన సినిమా ఇండస్ట్రీలో పెద్ద హీరో అని.. ఎన్నో అవార్డులు కూడా అందుకున్నారని గుర్తు చేశారు. అరచేతిలో సూర్యున్ని ఎలా ఆపలేరో.. అలాగే ఎన్టీఆర్ సినిమాలను కూడా ఎవరూ ఆపలేరని జూనియర్?కు మద్దతుగా నిలిచారు రోజా. ఎంత పెద్ద హీరో అయినా సినిమా బాగుంటేనే ప్రజలు చూస్తారని.. ఇందుకు పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమానే నిదర్శమన్నారు. హరిహర వీరమల్లు సినిమాను హిట్ చేయడం కోసం ఎమ్మెల్యేలు టికెట్లు కొన్నా కూడా ఆ చిత్రాన్ని ఎవరూ చూడలేదన్నారు. కంటెంట్ ఉన్న సినిమాలను ఎవరూ అడ్డుకోలేరు.. బాగోలేని సినిమాలను ఎవరూ ఆడించలేరన్నారు రోజా. రాజకీయ లబ్ధి కోసం సినిమాలు తీస్తే ప్రజలను వాటిని ఆదరించారని పవన్ కల్యాణ్?పై పరోక్షంగా విమర్శలు గుప్పించారు రోజా.

## పేకాట ఆడుతూ పట్టుబడ్డ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావు తండ్రి, ఓ కార్పొరేటర్

**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావు తండ్రి కొండలరావు పేకాట ఆడుతూ రెడ్ హ్యాండెడ్?గా పట్టుబడ్డాడు. కొండలరావుతో పాటు మరో 11 మందిని ఎస్ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితులను కూకట్?పల్లి పోలీసులకు అప్పగించారు ఎస్ఓటీ పోలీసులు. కాగా, ఆదివారం (ఆగస్ట్ 17) కూకట్?పల్లిలోని ఓ గెస్ట్ హౌస్‌లో కొందరు పేకాట ఆడుతున్నట్లు ఎస్వోటీ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు.. గెస్ట్ హౌస్‌పై రైడ్ చేశారు. పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. గెస్ట్ హౌస్?లో రెండున్నర లక్షల నగదుతో పాటు 11 మంది మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.
పట్టుబడ్డ 11 మందిలో పలువురు ప్రముఖులు ఉన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావు తండ్రితో పాటు ఓ డివిజన్ కార్పొరేటర్ కూడా ఉన్నట్లు సమాచారం. అనంతరం నిందితులను కూకట్ పల్లి పోలీసులకు అప్పగించారు ఎస్వోటీ పోలీసులు. కూకట్?పల్లి పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

# ఆంధ్రప్రదేశ్ లో ఉగ్రవాదుల మూలాలతో పోలీసుల హై అలెర్ట్.. ఇంకా ఎక్కడెక్కడున్నారో?




**హైదరాబాద్ పెన్ పవర్:** నిన్న మొన్నటి వరకూ తెలంగాణలో మాత్రమే ఎక్కువ ఉగ్రకదలికలుండేవి. కానీ ఇప్పుడు అవి ఆంధ్రప్రదేశ్ కు కూడా పాకాయి. దీంతో ఇప్పటి వరకూ ఉగ్రవాదుల కదలికలపై పెద్దగా దృష్టిపెట్టని ఏపీ పోలీసులు ఇక ప్రతి నగరంలో ఉగ్ర కదలికలపై ఫోకస్ చేయాల్సి ఉంది. విజయనగరంలో ఉగ్రజాడలు ఎవరూ ఊహించలేదు. కానీ ఉగ్రవాద మూలాలున్న సమీర్, సిరాజ్ లను అదుపులోకి తీసుకున్నారు. దీంతో పెద్ద కుట్ర తప్పినట్లయింది.. దేశ వ్యాప్తంగా వీరి నెట్ వర్క్ ఉన్నట్లు విచారణలో బయటపడటంతో దేశమంతా ఆశ్చర్యపోవాల్సి వచ్చింది. మారుమూల జిల్లాలో ఈ ఉగ్రకదలికలకు ఊతం కల్పించిన విధానం విని కూడా వారు షాక్ కు గురయ్యారు. హైదరాబాద్, వరంగల్, విజయనగరం, బెంగళూరు నగరాల్లో బాంబు పేలుళ్లకు పాల్పడాలని కుట్ర చేసినట్లు విచారణలో వెల్లడయింది.

**రాయచోటిలోనూ...**
తర్వాత ఆంధ్రప్రదేశ్ లోని కడప జిల్లాలోని రాయచోటిలో కూడా ఉగ్రకదలికలు అందరినీ ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేశాయి. కరడు గట్టిన ఉగ్రవాదులు అబూబకర్ సిద్ధిఖీ, మహ్మద్ ఆలీ అలియాస్ మన్సూర్ ఢిల్లీకి పార్సిల్ బాంబు పంపేందుకు సిద్ధం చేసినట్లు పోలీసుల సోదాల్లో వెల్లడయింది. రాయచోటిలోని ఇద్దరి ఇళ్లలో పోలీసులు సోదాలు చేసినప్పుడు కీలక విషయాలు బయటపడ్డాయి. సిద్ధిఖీ ఇంట్లో పార్శిల్ బాంబులు కనుగొన్నారు. దీనిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీ చిరునామాతో పార్శిల్ చేసి సిద్ధంగా ఉన్నట్లు తెలుసుకున్నపోలీసులు ఢిల్లీలో పేలుళ్లకు ప్లాన్ చేశారా? అన్న కోణంలో దర్యాప్తు చేశారు. ఇప్పటికే తమిళనాడు ఇంటలిజెన్స్ పోలీసులతో పాటు రాయచోటి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మూడు ప్రధాన నగరాల మ్యాప్ లతో పాటు రైల్వే రూట్ మ్యాప్ దొరకడంతో దేశంలో ఎక్కడెక్కడ పేలుళ్లకు ఈ ఇద్దరు కరడుగట్టిన ఉగ్రవాదులు ప్లాన్ చేశారన్న విషయం వెల్లడయింది.

**తాజాగా ధర్మవరం పట్టణంలో...**
ఇక తాజాగా శ్రీసత్యసాయి జిల్లాలోని ధర్మవరంలో ఉగ్రవాదులతో సంబంధాలున్న వ్యక్తి దొరకడంపై కూడా ఒకింత దడపుట్టించేలా ఉంది. నూర్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేశారు. ఒక హోటల్‌లో వంట మనిషిగా పనిచేస్తున్న నూర్ ధర్మవరం పట్టణంలోని కోట కాలనీలో మూడు రోజుల క్రితం అదుపులోకి తీసుకునట్లు తెలిసింది. పాక్ ఉగ్రవాదులతో వాట్సాప్ కాల్స్ నూర్ మాట్లాడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. జైషే మహ్మద్ వంటి ఉగ్రవాద సంస్థతో పాటు పలు ఉగ్రవాద సంస్థలతో నూర్ కు లింకులున్నాయని పోలీసుల విచారణలో వెల్లడయినట్లు తెలిసింది. ఉగ్రవాదులతో నూర్ సంబంధాలపై పోలీసులు ఆరా తీశారు. అతని ఇంటి నుంచి సిమ్‌కార్డులు స్వాధీనం చేసుకున్న పోలీసులు నూర్ సోషల్ మీడియా అకౌంట్లపై పై ఫోకస్ పెట్టారు. ఆంధ్రప్రదేశ్ లో నలుమూలల ఉగ్రకదలికలు మాత్రం పోలీసులను మాత్రమే

# మరో మూడు రోజుల పాటు భారీ వర్షాల ముప్పు తప్పదట



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉపరితల ఆవర్తన ప్రభావంతో పాటు అల్పపీడనం ఎఫెక్ట్ తో రెండు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు దంచి కొట్టే ఛాన్స్ ఉందని తెలిపింది. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని కూడా చెప్పింది. అలాగే బలమైన ఈదురుగాలులు వీచే అవకాశముందని కూడా హెచ్చరించింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటు కొన్ని చోట్ల ఏపీలో పిడుగులు పడతాయని కూడా తెలిపింది. ఇక ప్రాజెక్టులు కూడా పూర్తిగా నిండిపోవడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తంగా ఉండాలని, దిగువకు నీటిని విడుదల చేయడంతో అధికారులు కూడా అలెర్ట్ చేసింది.

**బలమైన ఈదురు గాలులు...**
ఆంధ్రప్రదేశ్ లో కూడా కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. గంటకు నలభై నుంచి యాభై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని కూడా తెలిపింది. ఉత్తర కోస్తా ప్రాంతంలో కూడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని చెప్పింది. దక్షిణ కోస్తా లోనూ ఒకటి నుంచి రెండు మూడు చోట్ల అతి భారీ వర్షాలు పడతాయనితెలిపింది. రాయలసీమ ప్రాంతంలో మాత్రం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. కొన్ని చోట్ల పిడుగులు పడే అవకాశముందని కూడా తెలిపింది. కొన్ని జిల్లాల కలెక్టర్లకు విశాఖ వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

**తెలంగాణలో ఆరెంజ్ అలెర్ట్...**
అయితే తెలంగాణలో కూడా అల్పపీడనం ప్రభావంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం తెలిపింది. నేడు కూడా అతిభారీ వర్షాలు పడే అవకాశమున్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపింది. కొన్ని జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ ను జారీ చేసింది. పెద్దపల్లి, నిజామాబాద్, నిర్మల్, మంచిర్యాల, మహబూబాబాద్, ములుగు, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, జగిత్యాల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. ఆదిలాబాద్, కామారెడ్డి, కుమ్రంభీం ఆసిఫాబాద్, మెదక్, సంగారెడ్డి, సిరిసిల్ల, హనుమకొండ, వరంగల్, కామారెడ్డి జిల్లాల్లోనూ భారీ వర్షాలు పడతాయని తెలిపింది. వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని కూడా అధికారులు ప్రజలను కోరారు.

## విజయవాడ-హైదరాబాద్ హైవేపై ట్రాఫిక్ జామ్.. చిట్యాల వరకు నిలిచిపోయిన వాహనాలు



హైదరాబాద్ పెన్ పవర్:విజయవాడ-హైదరాబాద్ నేషనల్ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. వీకెండ్ ముగియడంతో ప్రజలు తిరిగి పట్నం బాట పట్టారు. ఈ క్రమంలో ఏపీ నుంచి వేల సంఖ్యలో వాహనాలు హైదరాబాద్ వైపు వస్తుండడంతో విజయవాడ%-% హైదరాబాద్ హైవేపై, టోల్‌ప్లాజాల వద్ద వాహనాల రద్దీ పెరిగింది. చిట్యాల మండలం పెద్దకాపర్తి దగ్గర ఫ్లైఓవర్ పనులు జరుగుతుండటంతో పెద్దకాపర్తి నుంచి చిట్యాల వరకు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో టోల్‌ప్లాజాల వద్ద మరిన్ని బూత్‌లను ఓపెన్ చేశారు. హైవే పై భారీగా వాహనాల రద్దీ నెలకొనడంతో ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తమయ్యారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనాలు ముందుకు కదలలేని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇందులోనే వర్షం కురుస్తుండటంతో వారి తిప్పలు మరింత ఎక్కువయ్యాయి.

## మేడ్చల్ సరోగసి కేసులో షాకింగ్ నిజాలు: ఇంటి ఫస్ట్ ఫ్లోర్ రూమ్ బ్యాచిలర్స్ కి అద్దెకిచ్చి మరీ... వీర్యం సేకరణ.. !

హైదరాబాద్ పెన్ పవర్: మేడ్చల్ సరోగసి కేసులో విచారణ ముమ్మరం చేశారు పోలీసులు. ఈ కేసుకు సంబంధించి పోలీసుల విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి.. ఏపీలోని చిలకలూరిపేటకు చెందిన లక్ష్మి రెడ్డిపై 2024లో ముంబైలో హ్యూమన్ ట్రాఫికింగ్ కేసు నమోదైనట్లు తెలుస్తోంది. కొన్ని నెలల క్రితం హైదరాబాద్ కు చేరుకున్న లక్ష్మి రెడ్డి.. కొడుకు సురేందర్ రెడ్డి, కూతురుతో కలిసి మరో దందా చేస్తున్నట్లు గుర్తించారు పోలీసులు. అంతే కాకుండా.. లక్ష్మి తన ఇంటి ఫస్ట్ ఫ్లోర్ లోని రూమ్ బ్యాచిలర్స్ కి మాత్రమే అద్దెకిచ్చి వారి దగ్గర నుంచి వీర్యం సేకరించినట్లు అనుమానిస్తున్నారు పోలీసులు.మాదాపూర్, అమీర్పేట, ఆర్టీసీ క్రాస్ రోడ్స్ ప్రాంతాల్లో ఉన్న ఫర్టిలిటీ సెంటర్ల తో పరిచయాలు పెంచుకొని దందా చేస్తున్నట్లు గుర్తించారు పోలీసులు. లక్ష్మి రెడ్డి, కొడుకు సురేందర్ రెడ్డి ఏజెంట్లుగా పని చేస్తూ.. అండాలు కావాలన్నా.. సరోగసి కోసం మహిళలు కావాలన్నా అరేంజ్ చేస్తామని వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు పోలీసులు. మూడు సార్లు అండాలు ఇస్తే 30 వేల రూపాయలు ఇస్తానని, సరోగసి ద్వారా పిల్లలను కనిస్తే 4 లక్షలు ఇస్తానని మహిళలకు వల వేసినట్లు తెలిపారు పోలీసులు. లక్ష్మీ రెడ్డి ఏజెంట్ గా ఉన్న 6 హాస్పిటల్స్ కి ఇప్పటికే నోటీసులు ఇచ్చారు పోలీసులు. హెగ్డే, శ్రీఫెర్టిలిటీ, అను, అమూల్య, ఈవీఎఫ్, ఫర్టి కేర్ ఆస్పత్రికి సంబంధించిన రికార్డులను పరిశీలించనున్నారు అధికారులు. లక్ష్మీ రెడ్డి, నరేందర్ రెడ్డిని కస్టడీలోకి తీసుకుని విచారించాలని భావిస్తున్నారు పోలీసులు. నిందితులు ఇప్పటివరకు 50 మంది మహిళలతో సరోగసి చేయించినట్లు ఆధారాలు సేకరించారు పోలీసులు.నిందితురాలు లక్ష్మి సరోగసి ద్వారా బిడ్డలను కని ఇచ్చిన మహిళల లిస్ట్, వాళ్లకు ఇచ్చిన డబ్బుల వివరాలు కోసం డైరీ మెయింటైన్ చేస్తుందని తెలిపారు పోలీసులు.

# విషజ్వరాలతో వణికిపోతున్న తెలంగాణ... ఆసుపత్రులన్నీ రోగులతో కిటకిట

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో విష జ్వరాలు పెరిగిపోతున్నాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వాటితో పాటు వైరల్ ఫీవర్స్ వణికిస్తున్నాయి. ఇటీవల కాలంలో ఎక్కువగా వర్షాలు పడుతుండటంతో దోమల వ్యాప్తి ఎక్కువయింది. దీంతో ఎక్కువ మంది జ్వరపీడితులు తెలంగాణలో కనిపిస్తున్నారు. ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రులన్నీ రోగులతో కిటకిటలాడుతున్నాయి. జ్వరం, జలుబు, ఒళ్ళునొప్పులతో ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య పెరిగిపోయింది. అదే సమయంలో డెంగీ జ్వరం కూడా తెలంగాణను వణికిస్తుంది. మరొకవైపు మలేరియా వ్యాధి కూడా ప్రబలుతోందని లెక్కలు చెబుతున్నాయి. అనేక మంది ఇన్ పేషెంట్లుగా ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు.




**భారీ వర్షాలతో...**

గత రెండు వారాల నుంచి భారీ వర్షాలు నమోదు అవుతుండటంతో దోమల వ్యాప్తి పెరిగిందని వైద్యులు చెబుతున్నారు. తెలంగాణలోని హైదరాబాద్ తో పాటు అన్ని ప్రాంతాల్లో ఇటువంటి కేసులు నమోదవుతున్నాయని వైద్యులు తెలిపారు. ప్రధానంగా ములుగు, మహబూబ్ నగర్, మెదక్, యాదాద్రి భువనగిరి, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, వరంగల్, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో జ్వరాలతో ఆసుపత్రికి వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. ఈ ఏడాది ఇప్పటి వరకూ దాదాపు మూడు వేలకుపైగా డెంగీ కేసులు నమోదయినట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. ప్లేట్ లెట్స్ పడిపోతుండటంతో రక్త సేకరణ కూడా ఖర్చుతో కూడిన విషయంగా మారింది.

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో...**

రక్తదాతలు సహకరిస్తున్నప్పటికీ అందరూ ప్రయివేటు ఆసుపత్రిలో చేరే స్థోమత లేకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రులు కూడా రోగులతో కిటకిటలాడిపోతున్నాయి. దీంతో పాటు చికెన్ గున్యా కేసులు కూడా ఎక్కువగా ఉన్నాయంటున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ పదమూడు లక్షల మంది జ్వరాన పడినట్లు వైద్య శాఖ అధికారులు విడుదల చేసిన గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత కూడా ప్రజలను ఇబ్బందులను పెడుతుంది. ఓపీ కౌంటర్ల వద్ద కూడా ప్రభుత్వ ఆసుపత్రుల్లో రద్దీ పెరిగింది. జ్వరంతో వచ్చిన వారికి పరీక్షలు చేసి వారికి రోగ నిర్ధారణ చేసే సమయానికి తలదాచుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. మొత్తం మీద తెలంగాణలో జ్వరంతో బాధపడుతున్న వారి సంఖ్య లక్షల్లో ఉందని చెబుతున్నారు. ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## యూత్‌ను ఉర్రూతలూగిస్తున్న.. మనాలి స్కేట్‌బోర్డింగ్ వీడియో



హైదరాబాద్ పెన్ పవర్:మీరెప్పుడైనా స్కేటింగ్ చేశారా..స్కేట్ బోర్డింగ్ గురించి తెలుసా..టీవల కాలంలో ఏ ఇండోర్ స్టేడియాల్లో, పార్కుల్లో, రోడ్లపై కాళ్లు వీల్స్ షూల్ వేసుకొని, చేతులకు గ్లౌజ్ లు తొడుక్కొని,తలపై హెల్మెట్ పెట్టుకొని స్కేటింగ్ చేస్తున్న దృశ్యాలు మనకు కనిపిస్తుంటాయి.. ముఖ్యంగా పిల్లలు, యువతను ఈ స్కేటింగ్ క్రీడ బాగా ఆకట్టుకుంటోంది. హిమాచల్ ప్రదేశ్ లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం మనాలిలో ఇటీవల ఓ విదేశీ పర్యాటకుడు సాహసోపేతమైన స్కేట్ బోర్డింగ్ చేస్తున్న వీడియో వైరల్ అవుతోంది. ఈ వీడియోలో అతని పెర్ఫార్మెన్స్ చూసేవారిని బాగా ఆకట్టుకుంటోంది. అదేంటో చూద్దాం రండి.. భారతదేశంలో స్కేట్ బోర్డింగ్ ఇటీవల కాలంలో బాగా ప్రాచుర్యం పొందుతోంది. యువతలో ఈ క్రీడపై ఆసక్తి బాగా పెరుగుతోంది. దేశవ్యాప్తంగా కొత్తగా స్కేట్ పార్కులు నిర్మిస్తున్నారు. గతంలో స్కేట్ బోర్డింగ్ గురించి చాలా తక్కువ మందికి మాత్రమే తెలిసేది కానీ ఇప్పుడు ఇది ఒక ప్రధాన క్రీడగా మారుతోంది. ఇక విదేశాల్లో ఈ క్రీడకున్న ప్రాముఖ్యత గురించి చెప్పనక్కర్లేదు. హిమాచల్ ప్రదేశ్ లోని పర్యాటక ప్రాంతం మనాలిలో ఆ విదేశీ పర్యాటకుడికి చెందిన సాహసోపేతమైన వీడియో వైరల్ అయింది. పచ్చని కొండల మధ్య, నీలిరంగు ఆకాశం కింద, ఆ విదేశీ పర్యాటకుడు హెల్మెట్, చేతి తొడుగులు, కాన్వాస్ బూట్లు ధరించి, రోడ్డుపై కార్లు, బైక్లు, ట్రక్కులు, ఆవులను జాగ్రత్తగా దాటుతూ జిగ్జాగ్ కదలికలతో స్కేటింగ్ ట్రిక్స్ చేస్తూ సాహసాన్ని చూపించాడు.

ఈ దృశ్యం వీడియో గేమ్ ను పోలిన ఓ సాహసోపేత అనుభవాన్ని అందిస్తూ పర్యాటకులలో ఎక్సైట్ మెంట్ ను కలిగిస్తుంది. ఇది పర్యాటకులకు కొత్త రకమైన ఎడ్వెంచర్ స్పోర్ట్స్ అనుభవాలను అందిస్తూ సాహసోపేత ప్రయాణాలకు ప్రేరణగా కలిగిస్తుంది.

అయితే ఇలాంటి సాహసాలు ప్రమాదాలకు గురవటానికి కూడా అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు చూసేవాళ్లు. కార్లు, బైకులు, పెద్ద వెహికల్స్, పెదవి జంతువుల మధ్య వేగంగా స్కేటింగ్ చేస్తున్నప్పుడు ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువే. చిన్న తప్పిదం జరిగినా నియంత్రణ కోల్పోయినా తీవ్ర ప్రమాదాలకు దారి తీయొచ్చు. ఈ కారణంగా ఎప్పుడూ జాగ్రత్తగా, పూర్తిగా సురక్షిత మార్గదర్శకాలు పాటిస్తూ మాత్రమే ఇలాంటి సాహసాలు చేయడం అవసరం అంటున్నారు. మనాలిలో ఈ వీడియో సాహసం, సాహసోపేత జ్ఞాపకాలను అందిస్తూ పర్యాటకులలో ఉత్సాహాన్ని పెంచగా, మరో వైపు ప్రమాదాలతో జరిగే పర్యవసానాలను గుర్తు చేస్తుంది. సాహసం ఎప్పుడూ సేఫ్ గా ఉండాలి. ఇలాంటి సాహసాలు అద్భుతమైన అనుభవాలనిస్తాయి కానీ వాటితో కూడిన ప్రమాదాలను ఏకాగ్రతతో, జాగ్రత్తతో మాత్రమే ఎదుర్కోవాలని గుర్తు చేస్తుంది.

# నిర్మాతలకు మా గోడు పట్టదా.. సంపాదనలో సగం వైద్యానికే ఖర్చు : సినీ కార్మికులు

హైదరాబాద్ పెన్ పవర్:వేతనాలు పెంచాలంటూ సినీ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. 13 రోజుల నుంచి నిరసన కొనసాగుతున్నా.. నిర్మాతలు పట్టించుకోవడంలేదని ఫిల్మ్ ఫెడరేషన్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాతలు తమను మాఫియాలాగా చిత్రీకరిస్తున్నారని, ఇది సరికాదని ఖండించారు. నిర్మాతల ఆర్థిక నష్టాలకు కార్మికులు బాధ్యులు కాదని స్పష్టం చేశారు. సినీ పెద్దలు తమ సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని కార్మికులు విజ్ఞప్తి చేశారు.




**సంపాదనలో సగం డబ్బులు వైద్యానికే ఖర్చు**

ప్రస్తుతం ఒక రోజు కాల్‌షీట్‌కు ఇస్తున్న రూ.1280 వేతనం హైదరాబాద్ లాంటి నగరంలో జీవించడానికి ఏ మాత్రం సరిపోవడం లేదని కార్మికులు తెలిపారు. ప్రతి సంవత్సరం ఒక వేతనం పెంపు ఉండాలని, కానీ అది జరగడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. చట్ట ప్రకారం రోజుకు ఎనిమిది గంటలు మాత్రమే పని చేయించుకోవాలని ఉన్నప్పటికీ, చిత్ర నిర్మాతలు తమతో 12 నుంచి 17 గంటల వరకు పని చేయించుకుంటున్నారని ఆరోపించారు. ఈ అధిక పని గంటల వల్ల తమ ఆరోగ్యం క్షీణించి, బీపీ, షుగర్ వంటి వ్యాధులు వస్తున్నాయని, సంపాదనలో సగం డబ్బులు వైద్యానికే ఖర్చు అవుతున్నాయని వాపోయారు.

సినీ ప్రముఖులు, ప్రభుత్వాల మద్దతు కోసం విజ్ఞప్తి

తమ సమస్యలను పరిష్కరించడానికి చిరంజీవి, బాలకృష్ణ, మోహన్ బాబు వంటి సినీ ప్రముఖులు, అలాగే సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి చొరవ తీసుకోవాలని కార్మికులు విజ్ఞప్తి చేశారు. ఒకప్పుడు దాసరి నారాయణరావు వంటి సినీ పెద్దలు తమ కష్టాలను పరిష్కరించేవారని గుర్తు చేసుకున్నారు. నిర్మాతలు తమను మాఫియాలాగా చిత్రీకరిస్తున్నారని, ఇది సరికాదని ఖండించారు. నిర్మాతల ఆర్థిక నష్టాలకు కార్మికులు బాధ్యులు కాదని స్పష్టం చేశారు. అలాగే, ఆహార నాణ్యత, పంపిణీ విషయంలో తమపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని, తాము కేవలం నిర్మాతల ఆదేశాల ప్రకారం పని చేస్తామని వివరించారు.

**మహిళా కార్మికుల ప్రత్యేక సమస్యలు**

షూటింగ్ లొకేషన్లలో కనీస సౌకర్యాలైన టాయిలెట్లు, అంబులెన్స్ సదుపాయాలు లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని మహిళా వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ లలితా పేర్కొన్నారు. వంటపని చేసే మహిళా కార్మికులకు తాగునీటి సదుపాయం కూడా సరిగా లేదని, స్వయంగా నీటి క్యాన్లు మోసుకుని వంటపని చేసుకోవాల్సి వస్తుందని వివరించారు. వారంలో ఏడు రోజులు పని కల్పించాలని, లేకపోతే తమ జీవనం కష్టమవుతుందని ప్రభుత్వాన్ని, సినీ పెద్దలను వారు కోరారు.

# ఖర్చులను లెక్కగట్టేందుకు.. స్మార్ట్ అసిస్టెంట్‌గా AI .. నిర్ణయం సరియైనదేనా?

హైదరాబాద్ పెన్ పవర్:ఖకొందరు ఖర్చు గురించి మనం చాలా ఆలోచిస్తుంటారు.. ఖర్చులు ఎంత చేయాలి.. ఎలా చేయాలి.. బడ్జెట్ కు తగ్గట్టుగా ఎలా ఖర్చు చేయాలి.. ఇలా ఖర్చుల నిర్వహణకు తల బద్దలు కొట్టుకుంటుంటారు.. అయితే ఈ మధ్య కాలంలో ఖర్చుల నిర్వహణకు కృత్రిమ మేధస్సు వినియోగం భాగా పెరిగింది.. భవిష్యత్తులో ఇది ఇంకా పెరిగే అవకాశమూ ఉంది. ఇది ఇప్పటికే అనేకరికి దైనందిన ఆర్థిక జీవితంలో భాగంగా మారింది. AI ఆధారంగా పనిచేసే బడ్జెట్ యాప్స్, ఖర్చు ట్రాకర్లు, పెట్టుబడి సలహాదారులు మొదలైనవి సులభంగా లభ్యం అవుతున్నాయి. అయితే చాలా మందిలో డౌట్ ఉంది.. ఖర్చుల మెయింటెనెన్స్ కు AI ని సలహాలిచ్చే స్మార్ట్ అసిస్టెంట్ గా ఉపయోగించాలా? అని..



AI- ఆధారిత బడ్జెట్ యాప్ లు మీ అన్ని ఆన్‌లైన్ లావాదేవీలను పరిశీలిస్తాయి. గత నెలలో మీరు ఎంత ఖర్చు చేశారో చెప్పడానికి బదులుగా మీరు ఎప్పుడు, ఎక్కడ ఎక్కువ ఖర్చు చేస్తారో అవి గుర్తిస్తాయి. %ూ×% సెకన్లలో భారీ మొత్తంలో లావాదేవీలను స్కాన్ చేయగలవు ,మనం పట్టించుకోని ట్రెండ్‌లను గుర్తించగలవు. ఖర్చు విధానాలు ,ఖర్చులను తగ్గించగల ప్రాంతాలను గుర్తిస్తుంది. ఇది మనం జీవన శైలి ఆధారంగా మన ఆర్థిక సంబంధ విషయాలను చెప్పగలవు. యూజర్లు వారి పొదుపు లేదా పెట్టుబడి లక్ష్యాలను వేగంగా సాధించడంలో ఇది సహాయపడుతుంది. అయితే AIపరిపూర్ణమైనది కాదు. నగదు కొనుగోళ్లు, తప్పుగా లేబుల్ చేయబడిన లావాదేవీలు వ్యవస్థను గందరగోళానికి గురి చేస్తాయి. చెక్ చేసుకోవడం మంచిదని ఆర్థిక నిపుణులు అంటున్నారు. ఎకనామికల్ డేటా చాలా సున్నితమైనది.అందుకే వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలి. ప్రసిద్ధ AI సాధనాలు గోప్యతా ప్రమాణాలు ,RBI లేదా జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్ వంటి నియంత్రణ చట్రాల క్రింద పనిచేస్తాయి. యూజర్లు స్పష్టమైన ప్రైవసీ సిస్టమ్ తో బ్యాంక్-గ్రేడ్ ఎన్‌క్రిప్షన్‌ను ఉపయోగించే సేవలను మాత్రమే ఎంచుకోవాలని హెచ్చరిస్తున్నారు.AI పైలట్‌గా కాకుండా కో-పైలట్‌గా వ్యవహరించాలని చెబుతున్నారు. మీ స్వంత నిర్ణయంతో ఉపయోగించినప్పుడు AI ఉత్తమంగా పనిచేస్తుంది. ఇది మీకు మార్గనిర్దేశం చేయగలదు. ఏవైనా ఖర్చులను మర్చిపోయినట్లయితే గుర్తు చేస్తాయి కానీ మీ నిజమైన లక్ష్యాలు, మీ కుటుంబ ప్రణాళికలు లేదా మీ రిస్క్ ఏమిటో మీకు మాత్రమే తెలుసు. మీ కోసం నిర్ణయాలు తీసుకునే సాధనంగా కాకుండా మీ నిర్ణయం తీసుకోవడాన్ని సమర్థించే స్మార్ట్ సాధనంగా AI ని వినియోగించాలని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. సరళంగా చెప్పాలంటే త్వరిత గతిన ఆర్థిక సపోర్ట్ ఇవ్వడంలో AI అద్భుతంగా ఉంటుంది. తమ ఖర్చులను బాగా అర్థం చేసుకోవడానికి ,నియంత్రించాలనుకునే వ్యక్తులకు ఇది బెస్ట్ సపోర్టర్.AI ,మానవ అవగాహన కలిసి పనిచేసినప్పుడు బలమైన ఆర్థిక వృద్ధిని పొందే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంటున్నారు.

# అతి తక్కువ ఫీజుతో దుబాయ్ వర్చువల్ వీసా!

- భారతీయులకు దుబాయ్ 'డిజిటల్ నోమాడ్ వీసా' జారీ
- ఏడాది పాటు దుబాయ్‌లో నివసిస్తూ పనిచేసేందుకు అవకాశం
- యూఏఈ బయటి కంపెనీల్లో పనిచేసే వారికి మాత్రమే వర్తింపు
- నెలకు కనీసం రూ.3 లక్షల ఆదాయం తప్పనిసరి
- స్పాన్సర్ లేకుండానే నేరుగా దరఖాస్తు చేసుకునే వీలు
- ఆన్‌లైన్ ద్వారా సులభంగా అప్లై చేసుకునే సౌకర్యం




హైదరాబాద్ పెన్ పవర్:రిమోట్‌గా పనిచేసే భారతీయ ఉద్యోగులకు, నిపుణులకు దుబాయ్ ప్రభుత్వం ఒక అద్భుతమైన అవకాశాన్ని అందిస్తోంది. దుబాయ్‌లో ఏడాది పాటు నివసిస్తూ, పని చేసేందుకు వీలు కల్పించే 'డిజిటల్ నోమాడ్ వీసా'ను అందుబాటులోకి తెచ్చింది. దీనిని 'వర్చువల్ వర్కింగ్ ప్రోగ్రామ్' అని కూడా పిలుస్తున్నారు. ఈ వీసా ద్వారా స్పాన్సర్ అవసరం లేకుండానే దుబాయ్‌లో నివసిస్తూ, తమ ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించవచ్చు.

**అర్హతలు ఏమిటి?**
ఈ ప్రత్యేక వీసా పొందాలనుకునే వారు కొన్ని ముఖ్యమైన అర్హతలను కలిగి ఉండాలి. దరఖాస్తుదారులు యూఏఈ బయట రిజిస్టర్ అయిన కంపెనీలో ఉద్యోగిగా ఉండాలి లేదా స్వదేశంలో సొంత వ్యాపారం కలిగి ఉండాలి. కనీసం ఏడాది పాటు ఉద్యోగం కొనసాగిస్తారని తెలిపే ధృవీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. అన్నిటికంటే ముఖ్యంగా, వారి నెలవారీ ఆదాయం కనీసం 12,856 యూఏఈ దిర్హామ్‌లు (భారత కరెన్సీలో సుమారు రూ.3.06 లక్షలు) ఉండాలి. ఈ నిబంధనలను పాటిస్తే వీసాకు దరఖాస్తు చేసుకోవచ్చు.

**కావాల్సిన పత్రాలు**
దరఖాస్తు చేసుకునేందుకు కనీసం ఆరు నెలల వ్యాలిడిటీ ఉన్న పాస్‌పోర్ట్, దుబాయ్‌లో నివాసముండే కాలానికి సరిపడా ఆరోగ్య బీమా, ఉద్యోగ ధ్రువీకరణ పత్రం, సొంత దేశంలో ఎలాంటి నేర చరిత్ర లేదని తెలిపే క్లీన్ క్రిమినల్ రికార్డ్ సర్టిఫికెట్ అవసరం. వీటితో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫోటో, గత నెల జీతం స్లిప్ లేదా మూడు నెలల బ్యాంక్ స్టేట్‌మెంట్, దుబాయ్‌లో నివాస చిరునామా రుజువు జతచేయాలి.

**దరఖాస్తు ప్రక్రియ**
ఆసక్తి ఉన్నవారు జీడీఆర్ఎఫ్ఏ-దుబాయ్ పోర్టల్ లేదా వర్చువల్ వర్కింగ్ ప్రోగ్రామ్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా దుబాయ్‌లోని అమెర్ సెంటర్‌లో వ్యక్తిగతంగా కూడా దరఖాస్తు సమర్పించవచ్చు. దరఖాస్తు రుసుము 372.5 దిర్హామ్‌లు (సుమారు రూ.8,876) కాగా, ఇతర ఖర్చులతో కలిపి మొత్తం సుమారు రూ.53,377 వరకు అవుతుంది. దరఖాస్తు ఆమోదం పొందిన తర్వాత, దుబాయ్‌కి చేరుకుని మెడికల్ టెస్ట్, బయోమెట్రిక్స్, ఎమిరేట్స్ ఐడీ ప్రక్రియలను పూర్తి చేయాల్సి ఉంటుంది. సాధారణంగా 5 నుంచి 14 పనిదినాల్లో వీసా ప్రక్రియ పూర్తవుతుంది. ఈ వీసా కాల వ్యవధి ఒక సంవత్సరం కాగా, అర్హతలు కొనసాగితే పునరుద్ధరించుకునే అవకాశం కూడా ఉంది.

# సెల్ ఫోన్ స్క్రీన్ టైంకు..పిల్లల్లో గుండె ప్రమాదాలకు లింక్ ఉందా?..మీ బిడ్డను ఎలా రక్షించుకోవాలంటే



హైదరాబాద్ పెన్ పవర్:పిల్లలు ఎక్కువగా సెల్ ఫోన్ చూస్తున్నారా.. స్క్రీన్ సమయం పెరిగితే పిల్లల్లో కేవలం మానసిక ఆరోగ్యం, కంటిచూపుపైనే కాదు గుండె ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. జర్నల్ ఆఫ్ ది అమెరికన్ హార్ట్ అసోసియేషన్ లో ప్రచురించబడిన ఒక కొత్త అధ్యయనం ఈ విషయాన్ని నిర్ధారించింది. ముఖ్యంగా భారతీయ కుటుంబాల్లో దీని ప్రభావం ఎక్కువఅని తెలుస్తోంది. ఎందుకంటే మనదేశంలో ప్రత్యేకించి 2020లో ఆన్‌లైన్ తరగతులు ప్రారంభమైన తర్వాత స్మార్ట్‌ఫోన్ వాడకం బాగా పెరిగింది.
ఈ అధ్యయనం డెన్మార్క్‌లో 1,000 కంటే ఎక్కువ మంది తల్లిదండ్రులు,పిల్లలపై జరిగింది. స్క్రీన్ సమయం ప్రతి అదనపు గంట పెరిగితే, 6నుంచి 10 ఏళ్ల పిల్లలలో ,కౌమారదశలో ఉన్నవారిలో గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం గణనీయంగా పెరిగిందని అధ్యయనం చెబుతోంది. అధ్యయనం ప్రకారం.. తక్కువ లేదా ఆలస్యంగా నిద్రపోయే పిల్లలలో ఈ ప్రమాదం మరింత ఎక్కువగా ఉంది. స్క్రీన్ సమయం వల్ల కలిగే ప్రమాదాన్ని తగ్గించడంలో నిద్ర చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.స్క్రీన్ సమయం శరీరంలోని జీవక్రియల మార్పులకు సంబంధించిన ఓ ప్రత్యేకమైన ఫింగర్ ప్రింట్ ను సృష్టిస్తుంది. ఇది గుండె సంబంధిత వ్యాధులకు దారితీసే జీవసంబంధమైన సంకేతాన్ని సూచిస్తుంది. ఈ "ఫింగర్ ప్రింట్" ఆధారంగా కౌమారదశలో ఉన్నవారిలో 10 సంవత్సరాల తర్వాత గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని అంచనా వేయవచ్చు.

భారతీయ కుటుంబాలపై ప్రభావాలు
ఈ అధ్యయనం భారతీయ కుటుంబాలకు ఎందుకు ముఖ్యమైనదో ఇక్కడ అధ్యయనం వివరించింది. భారతదేశంలో పిల్లలు తమ రోజులో ఎక్కువ సమయం స్మార్ట్‌ఫోన్‌లు, టీవీలు, గేమింగ్‌తో గడుపుతున్నారు. ఇది వారి జీవనశైలిని మార్చి, శారీరక శ్రమను తగ్గిస్తుంది.స్క్రీన్ నుండి వచ్చే నీలి కాంతి ( మెదడును చురుకుగా ఉంచుతుంది. ఇది నిద్రను ప్రభావితం చేస్తుంది. తక్కువ నిద్ర వలన జీవక్రియలో సమస్యలు, ఊబకాయం ,మధుమేహం వంటి వ్యాధులు వస్తాయి.
స్క్రీన్ సమయం పెరగడం వల్ల పిల్లలు కదలకుండా ఉంటారు.దీని వలన ఊబకాయం, రక్తపోటు ,కొలెస్ట్రాల్ వంటి గుండె సమస్యలు వచ్చే అవకాశాలు పెరుగుతాయి.
ఎక్కువ స్క్రీన్ సమయం ఉన్న పిల్లలు అనారోగ్యకరమైన చిరుతిండి తినడానికి ఎక్కువ మొగ్గు చూపుతారు.ఇది గుండె ఆరోగ్యానికి హానికరం.
పరిష్కారాలు..

**పిల్లల గుండె ఆరోగ్యాన్ని కాపాడటానికి కొన్ని సులభమైన మార్గాలు:**

స్క్రీన్ సమయానికి షెడ్యూల్..పిల్లలకు రోజుకు ఎంత సమయం స్క్రీన్ ఉపయోగించాలో నిర్ణయించండి. హోంవర్క్ లేదా ఆన్‌లైన్ క్లాసులు తప్ప, మిగతా సమయాన్ని ఆటలు లేదా ఇతర కార్యకలాపాలకు కేటాయించాలి. మంచి నిద్ర అలవాట్లు..పడుకోవడానికి కనీసం ఒక గంట ముందు పిల్లలు ఫోన్లు, టీవీలు, టాబ్లెట్‌లకు దూరంగా ఉండేలా చూడాలి. దీని వల్ల వారు త్వరగా,ప్రశాంతంగా నిద్రపోగలుగుతారు.
శారీరక శ్రమను ప్రోత్సహించాలి.. పిల్లలను ఇంట్లోనే కాకుండా, బయట ఆడటానికి ప్రోత్సహించాలి..ఇది వారి గుండె ఆరోగ్యానికి, మానసిక ఆరోగ్యానికి చాలా మంచిది.కుటుంబంతో సమయం గడపాలి.. కుటుంబ సభ్యులందరూ కలిసి ఆటలు ఆడటం, పుస్తకాలు చదవడం లేదా ఇంట్లోని పనుల్లో సహాయపడటం వంటివి చేయాలి. ఇది స్క్రీన్ సమయాన్ని తగ్గించడంతో పాటు, కుటుంబ సంబంధాలను కూడా మెరుగుపరుస్తుంది. చివరిగా పిల్లల భవిష్యత్తు ఆరోగ్యం వారి ప్రస్తుత అలవాట్లపై ఆధారపడి ఉంటుంది. ఈ చిన్న చిన్న మార్పులు వారి హృదయాలను రాబోయే దశాబ్దాల పాటు ఆరోగ్యంగా ఉంచుతాయి.